సాక్షి
తిరుపతి
ఆదివారం । 19 । జనవరి । 2025



పాతజ్ఞాపకాలు పరిమళించే..
పాత జ్ఞాపకాలు పరిమళించే వీధిక 'వెంటాడే జ్ఞాపకాలు' అని టీటీడీ మాజీ చైర్మన్ భూమన కరుణాకరరెడ్డి కొనియాడారు. - 8లో



సమాచారం ఇవ్వకుండానే..
టీటీడీలో సుమారు రూ.కోటి వెచ్చించి ఏర్పాటు చేసిన పుష్పాలంకరణలు తొలగించడం పై దాత ఆగ్రహం వ్యక్తం చేశారు. - 8లో

చెరిగిపోతాయా.. ఆనవాళ్లు!
గత ప్రభుత్వంలో చేసిన అభివృద్ధిని చెరిపేసేందుకు కొందరు నేతలు కక్ష గట్టారు. అభివృద్ధికి దిక్సూచిగా నిలిచిన శిలాఫలకాలను ధ్వంసం చేస్తున్నారు.



- 8లో

న్యూస్‌రీల్

నేడు సైన్స్ ల్యాబొరేటరీ ప్రారంభం



అధికారులతో మాట్లాడుతున్న ఎస్పీ మణికంఠ

తిరుపతి క్రైం : తిరుపతిలోని ప్రాంతీయ ఫోరెన్సిక్ సైన్స్ ల్యాబొరేటరీని వర్చువల్ విధానంలో కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షా ఆదివారం ప్రారంభించనున్నారు. ఈ సందర్భంగా తిరుపతి ఎస్పీ మణికంఠ చందోలు శనివారం ఈ ల్యాబొరేటరీని పరిశీలించి పలు ఏర్పాట్లు చేశారు. ఇందులో నేరాల విచారణకు ఆధునిక సాంకేతికత అందుబాటులో ఉంటుందని తెలిపారు.

మెయిన్స్ అడ్మిట్ కార్డులు విడుదల

తిరుపతి సిటీ: జేఈఈ మెయిన్–2025 సెషన్–1కు సంబంధించి దరఖాస్తు చేసుకున్న విద్యార్థులకు అడ్మిట్ కార్డులను ఎన్‌టీఏ శనివారం విడుదల చేసింది. ఈనెల 22, 23, 24, 28, 29, 30 తేదీలలో రెండు షిఫ్టులలో జరిగే పరీక్షకు తిరుపతి జిల్లా నుంచి సుమారు 21,650 మంది విద్యార్థులు హాజరుకానున్నారు. జిల్లాలో మూడు పరీక్షా కేంద్రాలలో మాత్రమే పరీక్షను నిర్వహించనున్నారు. తిరుపతి జూపార్క్ దగ్గర గల ఇయాన్ డిజిటల్ సెంటర్, రంగంపేట కేఎంఎం కళాశాల, గూడూరు నియోజకవర్గం కోట పట్టణంలోని ఎన్‌బీకేఆర్ కళాశాలలో ఉదయం 9 నుంచి 12 గంటల వరకు, మధ్యాహ్నం 3 నుంచి 6గంటల వరకు పరీక్షలు నిర్వహించనున్నారు.

ఫార్మసీ డిప్లొమో కోర్సుకు స్పాట్ అడ్మిషన్లు

తిరుపతి ఎడ్యుకేషన్ : తిరుపతి కేటీ రోడ్డులోని ఎస్వీ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో ఫార్మసీ డిప్లొమో ఖాళీ సీట్ల భర్తీకి స్పాట్ అడ్మిషన్లు చేపట్టనున్నారు. ఆ మేరకు ఆ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ వై.ద్వారకనాథరెడ్డి ఒక ప్రకటన విడుదల చేశారు. ఎంపీసీ, బైపీసీ ఉత్తీర్ణత సాధించిన వారు స్పాట్ అడ్మిషన్లకు అర్హులని తెలిపారు. బాలురు, బాలికలకు వేర్వేరుగా హాస్టల్ సదుపాయం ఉన్నట్లు పేర్కొన్నారు. ఆసక్తి గల వారు ఈ నెల 23వ తేదీలోపు అన్ని ధ్రువపత్రాలతో దరఖాస్తు అందించాలని తెలిపారు. మరిన్ని వివరాలకు 98482 17166, 99667 61446, 95506 90007 నంబర్లలో సంప్రదించాలని ప్రిన్సిపల్ సూచించారు.

ఎట్టకేలకు పరీక్షల షెడ్యూల్ విడుదల

తిరుపతి సిటీ: ఎస్వీయూ దూరవిద్యా విభాగం యూజీ, పీజీ కోర్సులకు సంబంధించి పరీక్షల షెడ్యూల్‌ను ఎట్టకేలకు వర్సిటీ అధికారులు విడుదల చేశారు. ఫిబ్రవరి 3 నుంచి వర్సిటీ డీడీఈ పరిధిలోని అన్ని కేంద్రాలలో నిర్వహించనున్నట్లు అధికారులు శనివారం టైంటేబుల్‌ను విద్యార్థులకు, పరీక్షా కేంద్రాలకు పంపారు. డిగ్రీ బీఏ, బీకాం, బీఎస్సీ, బీఎల్ఐసీ కోర్సులకు సంబంధించి ప్రథమ, ద్వితీయ, తృతీయ ఏడాది పరీక్షలతో పాటు పీజీ ఎంఏ, ఎంకామ్, ఎమ్మెస్సీ, ఎస్‌డబ్ల్యూ, ఎంఎల్ఐసీ, ఎంబీఏ ప్రథమ, చివరి ఏడాది పరీక్షలను ఫిబ్రవరి 3 నుంచి 9వ తేదీవరకు నిర్వహించనున్నారు. సోమవారం నుంచి అభ్యర్థులకు సంబంధిత స్టడీ సెంటర్లలో హాల్‌టికెట్లను అందజేయనున్నట్లు సమాచారం.

25న జోనల్ సమావేశం

చిత్తూరు కలెక్టరేట్ : జీఓ 117 రద్దు, ఉపాధ్యాయుల సర్దుబాటు, మోడల్ ప్రైమరీ స్కూళ్ల ఏర్పాట్లపై చర్చించేందుకు ఈ నెల 25వ తేదీన జోనల్ స్థాయి సమావేశాలు నిర్వహించనున్నారు. ఈ మేరకు శనివారం డీఈఓ కార్యాలయానికి రాష్ట్ర విద్యాశాఖ జారీ చేసిన ఉత్తర్వులు అందాయి. ఆ ఉత్తర్వుల మేరకు ఈ నెల 25వ తేదీన తిరుపతి జిల్లా కేంద్రంలో తిరుపతి, చిత్తూరు జిల్లాల కలెక్టర్ల ఆధ్వర్యంలో జోనల్ సమావేశం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

ఉత్తుత్తి సదస్సులు!

'అందరూ రెవెన్యూ సదస్సులకు రండి...మీ సమస్యలను చెప్పుకోండి. అక్కడికక్కడే పరిష్కారం పొందండి' అంటూ ఊదరగొట్టిన కూటమి నేతలు ఆపై చేతులు పైకెత్తేశారు. వేదికలపై నేతల ఆర్భాటం తప్ప ఒరగబెట్టింది ఏమీ లేదని అర్జీదారులు విమర్శలు గుప్పిస్తున్నారు. ఇచ్చిన అర్జీలకూ పరిష్కారం లేదని పలువురు బాహాటకంగానే దుమ్మెత్తి పోస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా గత డిసెంబర్ 6 నుంచి జనవరి 8 వరకు జరిగిన రెవెన్యూ సదస్సుల్లో మొత్తం 15,692 అర్జీలు అందగా అందులో 11,251 అర్జీలు పరిష్కారం కాలేదంటే ఈ సదస్సులు ఏమేరకు ఉపయోగపడ్డాయోనని స్థానికులు చర్చించుకుంటున్నారు.

ఫలితం లేదయ్యా



నా పేరు గుమ్మడి వీరాస్వామి. కలిచేడు గ్రామం, వెంకటగిరి నియోజకవర్గం. నా పొలాన్ని రెవెన్యూ రికార్డుల్లో నమోదు చేయలేదు. నాతో పాటు గ్రామంలోని అందరి రైతుల పొలాలకు సంబంధించి రెవెన్యూ రికార్డుల్లో పేర్లు లేవు. గ్రామంలో ఉన్న 1,800 ఎకరాల భూములకు పాసుపుస్తకాలు అందలేదు. మేమంతా కలిసి ఈ విషయమే ఈ నెల 4వ తేదీన మా గ్రామంలో జరిగిన రెవెన్యూ సదస్సు దృష్టికి తీసుకెళ్లాం. అధికారులకు వినతిపత్రం సమర్పించాం. అయినా ప్రయోజనం లేదు.

భూములున్నా పట్టాల్లేవ్



మాది చిల్లకూరు మండలం, తిక్కవరం గ్రామం. నా పేరు ఇసనాక జయశేఖరరెడ్డి. మా నానమ్మ పోలమ్మ పేరుతో తిక్కవరం రెవెన్యూ పరిధిలోని సర్వే నం.831, 832లో సుమారు మూడు ఎకరాల భూమి ఉంది. ఆ భూమిని నా పేరుమీద మార్చుకునేందుకు కూటమి ప్రభుత్వం పెట్టిన రెవెన్యూ సదస్సుకు వెళ్లా. మా నానమ్మ పేరుతో ఉన్న భూమికి సంబంధించిన రికార్డులన్నీ అధికారులకు చూపించా. ఒక వారంలోగా సమస్య పరిష్కరిస్తామని చెప్పారు. కానీ ఇంకా పరిష్కరించలేదు.



న్యాయం చేయాలంటూ తిరుపతి మంగళం రెవెన్యూ సదస్సులో స్థానికుల నిరసన (ఫైల్)

- ఆర్భాటంగా రెవెన్యూ సదస్సులు
- అర్జీలిచ్చినా పరిష్కారం చూపని అధికారులు
- పెదవి విరుస్తున్న పేదలు

తిరుపతి అర్బన్: కూటమి నేతల మాటలతో సామాన్య ప్రజలు మురిసిపోయారు. రెవెన్యూ సదస్సుల్లో ప్రతి అర్జీకి పరిష్కారం చూపిస్తామంటే ఔనే..అనుకుని క్యూకట్టారు. కానీ పేరుకే సదస్సులు.. పరిష్కారం లేదని తెలుసుకుని కూటమి ప్రభుత్వంపై విమర్శలు ఎక్కుపెడుతున్నారు. జిల్లాలో గత ఏడాది డిసెంబర్ 6 నుంచి ఈ నెల 8వ తేదీ వరకు రెవెన్యూ సదస్సులు నిర్వహించారు. మొత్తం 15,692 అర్జీలు రాగా.. అందులో 11,251 అర్జీలు రెవెన్యూ సమస్యలపైనే వచ్చాయి. మిగిలిన 4,441 అర్జీలు వివిధ సమస్యలపై రాగా.. వాటిని తూతూమంత్రంగా పరిష్కరించారు. రెవెన్యూ సమస్యలపై వచ్చిన అర్జీల జోలికి వెళ్లలేదు.



శెట్టిపల్లి రెవెన్యూ సదస్సులో మాట్లాడుతున్న కలెక్టర్ వెంకటేశ్వర్(ఫైల్)

శెట్టిపల్లె సమస్య అంతేనా?

గత ఏడాది డిసెంబర్ 30న తిరుపతి శెట్టిపల్లిలో రెవెన్యూ సదస్సును చేపట్టారు. ఇందులో మొత్తం 1,410 మంది ఇంటిపట్టాల సమస్యను, 248 మంది భూ సమస్యలను ఈనెల 5వ తేదీ నాటికి 30 శాతం, 16వ తేదీనాటికి నాటికి మరో 30 శాతం, 30వ తేదీనాటికి మిగిలిన 40శాతం పూర్తి చేస్తామని మాటిచ్చారు. అయితే ఇప్పటి వరకు ఒక శాతం సమస్యను కూడా పరిష్కరించలేదు. ఇలాంటి సమస్యలు శ్రీకాళహస్తి, వెంకటగిరి, సూళ్లూరుపేట, గూడూరు, చంద్రగిరి, సత్యవేడు నియోజకవర్గాల్లోనూ కోకొల్లలుగా ఉన్నాయి.

రెవెన్యూ డివిజన్	వచ్చిన అర్జీలు	పరిష్కరించినవి (శాతం)
సూళ్లూరుపేట	3,080	15
గూడూరు	5,990	18
శ్రీకాళహస్తి	1,570	16
తిరుపతి	5,052	25

వాటిపై విచారణ ఎక్కడ?

రెవెన్యూ సదస్సుల్లో నాయకులు మాత్రం దర్జాగా వేదికలపై కూర్చుని ఉపన్యాసాలు ఇచ్చారే తప్ప చేసింది ఏమీ లేదని ప్రజలు బాహాటకంగానే విమర్శలు చేస్తున్నారు. నకిలీ డాక్యుమెంట్లు తయారు చేసి తమ భూములను కొట్టేయాలని ప్రయత్నాలు చేస్తున్నారంటూ తిరుపతితోపాటు పలుచోట్ల అర్జీలు ఇచ్చినా వాటిపై ఇప్పటి వరకు విచారణ లేదు.

అర్జీలిస్తూనే ఉన్నాం



మా భూములు 22ఏలో ఉన్నాయి. ఈ సమస్యను పరిష్కారించాలని ఇప్పటికే పలుసార్లు అర్జీలు ఇచ్చాం. తాజాగా రెవెన్యూ సదస్సులోనూ అర్జీను అందించాం. అయినా ప్రయోజనం లేదు.
–దడియాల ఆనంద్, సుబ్బారెడ్డి నగర్, తిరుపతి

ప్రయోజనం శూన్యం



మా గ్రామంలో గిరిజనులు సాగుచేసుకుంటున్న భూములను అటవీశాఖ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. దీనిపై రెవెన్యూ సభల్లో వినతిపత్రాలు అందించాం. కనీసం మీ సమస్య ఎంటి? అని అడిగే నాధుడే లేరు. రెవెన్యూ సదస్సులు వేస్ట్.
–చిరంజీవి, రోసనూరు గ్రామం, పెళ్లకూరు మండలం

ఇంటిపట్టా కోసం..



గ్రామ సదస్సులు, రెవెన్యూ సదస్సులతో మాకు ఎలాంటి ఉపయోగం లేదు. ఒక్క రేణిగుంటలో నాలుగు వేల మంది పేదలకు ఇంటి స్థలాలు చూపాల్సి ఉంది. దీనిపై పలు అర్జీలు ఇచ్చాం. అయినా ప్రయోజనం లేదు.
–ఈశ్వరమ్మ, రేణిగుంట

ఆరు నెలలుగా తిరుగుతున్నా



మాకు రెండు సర్వే నంబర్లతో రెండు ఎకరాల పొలం ఉంది. రెండు పాస్ పుస్తకాలు ఇచ్చారు. ఆ రెండు సర్వే నంబర్లతో ఒక్కటే పాస్ పుస్తకం ఇస్తే బ్యాంక్‌లో రుణం తీసుకోవచ్చు. ఆరు నెలలుగా తిరుగుతున్నా. రెవెన్యూ సదస్సులో అర్జీ ఇచ్చా. అయినా ఫలితం లేదు.
–భాస్కర్‌రెడ్డి, అంబూరు గ్రామం, వరదయ్యపాళెం మండలం

పక్షుల పండగ..
ఏర్పాట్లు దండగ!

- స్టేట్ మెగా ఫెస్టివల్‌గా మారినా ఏర్పాట్లు పేలవం
- పర్యాటకులను అలరించని ఎగ్జిబిషన్ స్టాల్స్

సూళ్లూరుపేట: రాష్ట్ర ప్రభుత్వం పక్షుల పండుగను స్టేట్ మెగా ఫెస్టివల్‌గా ప్రకటించినా అందుకు తగినట్టుగా ఏర్పాట్లు చేపట్టడంలో విఫలమైంది. ఫ్లెమింగో ఫెస్టివల్–2025ను కలెక్టర్ డాక్టర్ ఎస్.వెంకటేశ్వర్ ఆధ్వర్యంలో అత్యంత పేలవంగా ప్రారంభించారు. దీని నిర్వహణ కోసం సుమారు రూ.6 కోట్లు మంజూరు చేసినా అందుకు తగినట్టుగా ఏర్పాట్లు మాత్రం కనిపించ లేదు. గతంలో ఎన్నడూ లేని విధంగా ఈ సారి అత్యంత దారుణంగా ఏర్పాట్లు చేశారు. జిల్లాలోని అన్ని శాఖలకు సంబంధించి ఏర్పాటు చేసిన ఎగ్జిబిషన్‌స్టాల్స్ పర్యాటకులను ఆకట్టుకోలేక పోతున్నాయి. గతంలో పండుగ అంటే అట్టహాసంగా చేసి జిల్లాలోని అన్ని శాఖల్లో జరిగిన అభివృద్ధి పనులు, జరగాల్సిన అభివృద్ధి పనులను ఎగ్జిబిషన్‌స్టాల్స్‌లో ప్రదర్శించి పర్యాటకులను ఆకట్టుకునే వారు. ఈ సారి ఏర్పాటు చేసిన స్టాల్స్‌ను చూసి పర్యాటకుల నిరుత్సాహంగా పెదవి విరుస్తున్నారు. ముఖ్యంగా జిల్లా ఉద్యానవనశాఖ స్టాల్ చాల పేలవంగా ఉంది. శాఖల మధ్య సమన్వయం లేక, జిల్లా కలెక్టర్ పర్యవేక్షణ, స్థానిక నాయకుల జోక్యం లేకపోవడంతో ఇలా జరిగి ఉండొచ్చని పర్యాటకులు చర్చించుకుంటున్నారు.



అత్యంత పేలవంగా కనిపిస్తున్న ఉద్యానవనశాఖ స్టాల్

ఆ వీడియో లేదా?

అంతరిక్ష విజ్ఞానం గురించి తెలియచేసేందుకు షార్ కేంద్రం వారు ఏర్పాటు చేసిన స్టాల్ ఈసారి అంతరిక్షం గురించి పర్యాటకులకు చూపించే వీడియో ప్రదర్శన లేకుండా చేశారు. అయితే వ్యోమగాములను అంతరిక్షంలోకి తీసుకెళ్లే క్రూమాడ్యూల్‌ను ఏర్పాటు చేయడంతో అందరూ ఆసక్తిగా తిలకిస్తున్నారు. ఈ సారికొత్తగా న్యూ జనరేషన్ లాంచింగ్ వెహికల్‌ను ప్రదర్శించారు. పులికాట్ వన్యప్రాణి సంరక్షణా విభాగం వారు ఏర్పాటు చేసిన ఎగ్జిబిషన్ స్టాల్ పరవాలేదనిపించింది. సాంస్కృతిక కార్యక్రమాలు కూడా పెద్దగా ఏమీలేకుండా చేశారు. శనివారం సినీతారల సందడి లేకుండా పోయింది.

ఫ్లెమింగో ఫెస్టివల్ క్రీడలు

ఫ్లెమింగో ఫెస్టివల్–2025 సందర్భంగా నిర్వహించిన క్రీడలను మంత్రి కందుల దుర్గేష్ ప్రారంభించారు. బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షులు వాకాటి నారాయణరెడ్డి కబడ్డీ పోటీలను ప్రారంభించి కబడ్డీ ఆడారు. ముఖ్యంగా కబడ్డీ, వాలీబాల్ క్రీడలను నిర్వహించారు.



ఫ్లెమింగో ఫెస్టివల్-2025 క్రీడల్లో భాగంగా వాలీబాల్ ఆడుతున్న క్రీడాకారులు

పక్షుల కేంద్రాన్ని సందర్శించిన మంత్రి



మాట్లాడుతున్న మంత్రి దుర్గేష్

దొరవారిసత్రం : నేలపట్టు పక్షుల కేంద్రాన్ని శనివారం సాయంత్రం పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్ సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన కేంద్రంలో విడిది చేసే విహంగాలను తిలకించారు. అనంతరం విలేకర్లతో మాట్లాడుతూ పర్యాటక ప్రాంతాలను, పక్షుల కేంద్రాల అభివృద్ధికి కృషి చేస్తామని తెలిపారు. ఆయన వెంట పలుశాఖల అధికారులు ఉన్నారు.

అప్రకటిత పాలకమండలి
ఇష్టారాజ్యం



శ్రీకాళహస్తీశ్వరాలయం

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయంలో అప్రకటిత పాలకమండలి రాజ్యమేలుతోంది. పాలనా పరమైన విషయాల్లో జోక్యం చేసుకుంటూ ఆలయాన్ని తమ కనుసన్నలో నడిచేవిధంగా మార్చేసింది. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో పాలకమండలి ఏర్పాటు చేయకముందే ఓ కార్యకర్త జులుం ప్రదర్శిస్తున్నాడని పచ్చమీడియా పిచ్చిరాతలు రాసింది. అప్పట్లో ఏదో జరిగిపోతోందంటూ టీడీపీ నేతలు గగ్గోలు పెట్టారు. అయితే గత ఆరు నెలలుగా శ్రీకాళహస్తీశ్వరాలయంలో ఓ ఐదుగురు వ్యక్తులు ఎమ్మెల్యే ముఖ్య అనుచరులమంటూ అప్రకటిత పాలకమండలిలా వ్యవహరిస్తున్నారు. అన్నదానం, గోశాల, మండపాల వద్ద తనిఖీలు నిర్వహిస్తున్నారు. టెండర్లు తదితర విషయాల్లో జోక్యం చేసుకుంటున్నారు. పాలకమండలి చైర్మన్‌గా ఎమ్మెల్యే నిర్ణయించిన ఓ నాయకునికి వ్యతిరేకంగా ఎస్సీవీ నాయుడు వర్గం మరో అభ్యర్థిని పోటీకి దించింది. దీన్ని ఆసరాగా చేసుకుని అప్రకటిత పాలకమండలి ఆలయంలో అధికారం చెలాయిస్తోంది. దీనిపై అధికారులు, స్థానిక ఎమ్మెల్యే ఏ నిర్ణయం తీసుకుంటారో వేచి చూడాలి మరి.

పక్షుల రక్షణకు ప్రాధాన్యం

- ఫ్లెమింగో ఫెస్టివల్ శ్రీసిటీ స్టాల్స్‌ను ప్రారంభించిన మంత్రి
- ప్రకృతి పరిరక్షణకు ప్రతి ఏడాదీ సీఎస్ఆర్ ద్వారా రూ.కోటి విరాళం : శ్రీసిటీ ఎండీ

శ్రీసిటీ (వరదయ్యపాళెం): సూళ్లూరుపేటలో శనివారం ప్రారంభమైన ఫ్లెమింగో ఫెస్టివల్‌లో ఎంపిక చేసిన ఐదు కీలక వేదికల్లో ఒకటైన శ్రీసిటీ జీవవైవిధ్యానికి కార్పొరేట్ సహకారం, సుస్థిరత, ఎకో టూరిజం అంశాలలో వినూత్న ఆలోచనలు రేకెత్తించే సదస్సులకు వేదికగా నిలిచింది. అలాగే సూళ్లూరుపేటలోని ఎగ్జిబిషన్ గ్రౌండ్‌లో శ్రీసిటీ ప్రగతిని ప్రతిబింబిస్తూ ఏర్పాటు చేసిన స్టాల్‌ను రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ మంత్రి కందుల దుర్గేష్ ప్రారంభించారు. అనంతరం శ్రీసిటీ బిజినెస్ సెంటర్‌లో జరిగిన కార్పొరేట్ సామాజిక బాధ్యత సదస్సులో కార్పొరేట్ చొరవ ద్వారా పర్యావరణ నిర్వహణ, సామాజిక స్పృహ అనే అంశాలను చర్చించారు. కలెక్టర్ డాక్టర్ ఎస్.వెంకటేశ్వర్, తిరుపతి సర్కిల్ ఫారెస్ట్ కన్జర్వేటర్ సి.సెల్వం, బాంబే నేచురల్ హిస్టరీ సొసైటీ (బీఎన్‌హెచ్ఎస్) డాక్టర్ సత్యసెల్వం, శ్రీసిటీ చైర్మన్ శ్రీనిరాజు, మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ రవీంద్ర సన్నారెడ్డి, వివిధ పరిశ్రమల ఉన్నతాధికారులు పాల్గొన్నారు. సమిష్టిగా వివిధ కీలక అంశాలపై ప్రస్తావించారు. ఫ్లెమింగో ఫెస్టివల్‌లో శ్రీసిటీ పాల్గొనడం సుస్థిరత, పర్యావరణ పరిరక్షణ పట్ల దాని నిబద్ధతకు నిదర్శనమంటూ కలెక్టర్ వ్యాఖ్యానించారు. పులికాట్ సరస్సు, వలస పక్షుల నివాసాలను రక్షించడానికి కార్పొరేట్ భాగస్వామ్యాలను ప్రోత్సహిస్తూ బీఎన్‌హెచ్ఎస్ డైరెక్టర్ డాక్టర్ కిషోర్ రితే ప్రత్యేక ప్రదర్శన ఇచ్చారు. అనంతరం చైర్మన్ శ్రీనిరాజు ప్రకృతి పరిరక్షణ పట్ల శ్రీసిటీ నిబద్ధతను హైలెట్ చేశారు. సుస్థిర భవిష్యత్తు కోసం పులికాట్ సరస్సు వంటి సంపదను కాపాడుకోవడానికి సమిష్టి, నిరంతర కృషి అవసరమని, ఇందుకోసం ఫ్లెమింగో ఫెస్టివల్ ఎంతో ఉపకరిస్తుందని శ్రీసిటీ ఎండీ డాక్టర్ రవీంద్ర సన్నారెడ్డి వ్యాఖ్యానించారు. శ్రీసిటీ పారిశ్రామిక కుటుంబం తరపున సీఎస్ఆర్ ద్వారా ఏటా రూ.కోటి వెచ్చిస్తామని ప్రకటించారు. ఈ సందర్భంగా శ్రీసిటీ పరిశ్రమల సీఎస్ఆర్ ప్రయత్నాలను అభినందిస్తూ జిల్లా కలెక్టర్, శ్రీనిరాజు, ఇతర ప్రముఖుల సమక్షంలో ఐఎంటీపీ, ఎస్ఎస్ ఇన్‌స్ట్రుమెంట్స్, కెలాగ్స్, పార్సన్ ప్యాకేజింగ్స్, ఇసుజు మోటార్స్, టీహెచ్‌కే, కోల్గేట్ పామోలివ్, డైకి అల్యూమినియం, బెర్గన్ పైప్స్, డానియల్లీ, అమిల్టన్, అస్ట్రోటెక్, ఫైలెక్స్, ఎస్ఎంసీసీ, వెస్ట్ ఫార్మా పరిశ్రమల అధికారులకు జ్ఞాపికలను అందజేశారు.



సదస్సుకు హాజరైన ప్రతినిధులతో కలెక్టర్ వెంకటేశ్వర్, శ్రీసిటీ చైర్మన్ శ్రీనిరాజు, ఎండీ రవీంద్ర సన్నారెడ్డి

క్లుప్తంగా

వేదిక్ వర్సిటీ రిజిస్ట్రార్‌గా కుమార్‌శర్మ


తారకరామ కుమార్‌శర్మను అభినందిస్తున్న వీసీ

తిరుపతి సిటీ : వేద విశ్వవిద్యాలయ నూతన రిజిస్ట్రార్‌గా కృష్ణ యజుర్వేద విభాగం సీనియర్ ప్రొఫెసర్ తారకరామ కుమారశర్మ నియమితులయ్యారు. ఈ మేరకు వీసీ రాణి సదాశివమూర్తి శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. బాధ్యతలు చేపట్టిన అనంతరం కుమార్‌శర్మ మాట్లాడుతూ.. వర్సిటీ అభివృద్ధికి తనవంతు కృషి చేస్తానని తెలిపారు. గతంలో రిజిస్ట్రార్‌గా ఉన్న రాధాగోవింద త్రిపాఠి డిప్యుటేషన్ కాల పరిమితి ముగియడంతో మాతృసంస్థ జాతీయ సంస్కృత వర్సిటీకి వెళ్లారు. వేదిక్ వర్సిటీ అభివృద్ధి కోసం త్రిపాఠి ఎనలేని కృషి చేశారని వీసీ, వర్సిటీ అధ్యాపకులు కొనియాడారు.

ఆర్టీసీ బస్సును ఢీకొన్న కారు

– కారు నుజ్జునుజ్జు



నాగలాపురం: ఆగి ఉన్న బస్సును అతివేగంగా వచ్చి కారు ఢీకొట్టిన ఘటన తిరుపతి–చెన్నై జాతీయ రహదారి కారణి గ్రామంలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు మేరకు.. శనివారం మధ్యాహ్నం తిరుపతి–చెన్నై జాతీయ రహదారిపై సత్యవేడు నుంచి తిరుపతి వెళ్తున్న ఆర్టీసీ బస్సు కారణి గ్రామం బస్‌స్టాప్ వద్ద ఆగింది. అదే సమయంలో తిరుపతి నుంచి చెన్నై వెళ్తున్న కారు అతి వేగంగా వచ్చి బస్సును ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో కారు నుజ్జునుజ్జు అయ్యింది. అందులోని నలుగురు ప్రయాణికులకు తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రులను ఓ ప్రయివేటు వాహనంలో ఊత్తుకోట ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

విష జ్వరంతో చిన్నారి మృతి


మృతిచెందిన దివ్యశ్రీ

బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలో ఓ చిన్నారి శుక్రవారం రాత్రి విషజ్వరంతో మృతి చెందింది. పెద్దపాలేడు గ్రామ దళితవాడకు చెందిన సుబ్రమణ్యం, వెంకటరత్నమ్మ కుమార్తె దివ్యశ్రీ (4) మూడు రోజులుగా విష జ్వరంతో బాధపడుతోంది. తల్లిదండ్రులు ఆ చిన్నారికి బుచ్చినాయుడుకండ్రిగ, శ్రీకాళహస్తిల్లోని ఆస్పత్రుల్లో చికిత్స చేయించారు. జ్వరం తగ్గకపోవడంతో శుక్రవారం తిరుపతిలోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చేర్చారు. అక్కడ చికిత్స పొందుతూ శుక్రవారం రాత్రి చిన్నారి మృతి చెందినట్లు తల్లిదండ్రులు తెలిపారు.

రెండు టిప్పర్ల స్వాధీనం

కోట: మండలంలోని చంద్రశేఖరపురం వద్ద గ్రావెల్ తరలిస్తున్న రెండు టిప్పర్లను శనివారం పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. సరైన పత్రాలు చూపకపోవడంతో రెండు వాహనాలను పోలీస్‌స్టేషన్‌కు తరలించి విచారిస్తున్నట్లు ఎస్ఐ పవన్‌కుమార్ తెలిపారు.

వాహనాలు తనిఖీ

విద్యానగర్‌లో రవాణాశాఖ అధికారి శాంతి వాహనాలను తనిఖీ చేశారు.

చెరిగిపోతాయా.. ఆనవాళ్లు!

- సూచిక బోర్డులు, శిలాఫలకాలతో సమాధుల నిర్మాణం
- అధికారుల అలసత్వంతోనే ప్రభుత్వ ఆస్తుల విధ్వంసం
- పాకాలలో తార స్థాయికి చేరిన పచ్చనేతల పైశాచికత్వం


కాలువపై మూతలుగా వాడిన తుడా నిధులతో ఏర్పాటు చేసిన అభివృద్ధి శిలాఫలకాలు


సమాధి వద్ద ఫ్లోరింగ్‌కి వాడిన తుడా నిధుల అభివృద్ధి శిలాఫలకాలు

తిరుపతి టాస్క్‌ఫోర్స్: ప్రజలు కట్టబెట్టిన అధికారాన్ని పాలకులు సద్వినియోగం చేసుకోవాలి. ప్రజల ఆస్తులకు, ప్రభుత్వ నిధులతో ఏర్పాటు చేసిన నిర్మాణాలకు ధర్మకర్తలుగా వ్యవహరించాలి. భవిష్యత్ తరాల బాగుకోసం దార్శనికతతో అభివృద్ధికై ప్రణాళికలు రచించాలి. వాటిని అంకిత భావంతో ఆచరణలో పెట్టాలి. ప్రజలకు మంచి చేయాలనే తపనతో ప్రజా సంక్షేమం, గ్రామీణాభివృద్ధి కోసం పాటుపడాలి. ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపర్చాలి. కానీ, పాలన పట్ల తన ప్రాథమిక కర్తవ్యాన్ని మరిచి ప్రజల జీవితాలతో చెలగాట మాడడం, అభివృద్ధి ఏమీ చేయకుండానే.. ఏదో చేస్తున్నట్టు ప్రకటనలు ఇచ్చుకుంటూ గత పాలకులు చేసిన అభివృద్ధికి ఆనవాళ్లు లేకుండా చేయడమే పనిగా పెట్టుకున్నారు పాకాల మండలంలోని పచ్చనేతలు. చంద్రగిరి నియోజకవర్గ ప్రజా ప్రతినిధి వీరికి అండగా నిలబడడం వల్లనే ఇంతకు బరితెగించారన్న విమర్శలు వస్తున్నాయి. ఇలాగే విచక్షణ మరిచి విధ్వంసాలకు తెగబడుతుంటే ప్రజాగ్రహంలో పచ్చనేతలు కొట్టుకుపోక తప్పదని స్థానిక ప్రజలు హెచ్చరిస్తున్నారు.

శ్రుతి మించిన ఆగడాలు

చంద్రగిరి నియోజకవర్గం, పాకాల మండలంలో పచ్చనేతల ఆగడాలు మితిమీరుతున్నాయి. పంటపల్లి, పాకాల పట్టణంలోని కరింతుల్లాబాద్ ప్రాంతాల్లో పచ్చపార్టీ నేతలు తమ పైశాచికత్వాన్ని అభివృద్ధికి ఆనవాళ్లుగా ఏర్పాటు చేసిన బండరాళ్లపై ప్రదర్శిస్తున్నారు. తుడా నిధులతో చేపట్టిన అభివృద్ధి పనులకు అప్పటి తుడా చైర్మన్, చంద్రగిరి శాసనసభ్యులు చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి ఏర్పాటు చేసిన సూచిక బోర్డులు, శిలా ఫలకాలను ధ్వంసం చేసి ఆ రాళ్లను తమ బంధువులు, కుటుంబీకుల సమాధుల నిర్మాణానికి వాడుతున్నారు. కొంతమంది పచ్చ నేతలు తమ ఇళ్ల ముందు మురుగు నీటి కాలువలపై మూతలుగా పెట్టుకున్నారు. ప్రభుత్వ ఆస్తులను పరిరక్షించాల్సిన పంచాయతీ అధికారుల అలసత్వంతోనే ఇదంతా జరుగుతోందన్న అసహనం ప్రజల్లో వ్యక్తమవుతోంది. కొత్తగా అధికారం చేపట్టిన కూటమి ప్రభుత్వంలోని పాలకులకు అభివృద్ధి చేయడం చేతగాక గత ప్రభుత్వంలో జరిగిన అభివృద్ధి పనుల ఆనవాళ్లు చెరిపివేస్తున్నారన్న ఆరోపణలు అన్నివర్గాల ప్రజల నుంచి వ్యక్తమవుతున్నాయి. ఇకనైనా పచ్చ నేతలు తమ దుశ్చర్యలను కట్టిపెట్టి ప్రజలకు మేలు చేయడానికి ప్రయత్నించాలని జనం కోరుకుంటున్నారు.

పంచాయతీ అధికారులపై చర్యలు ఏవీ?

తుడా నిధులతో అభివృద్ధి పనులు పూర్తి చేసి వాటి వివరాలను పొందు పరుస్తూ ఏర్పాటు చేసిన శిలా ఫలకాలు, సూచిక బోర్డులను పరిరక్షించాల్సిన పంచాయతీ అధికారులు వాటిని పట్టపగలు ధ్వంసం చేస్తున్నా పట్టించుకోవడం లేదు. ఈ విషయంపై మండల స్థాయి అధికారులకు ఫిర్యాదులు వెళ్లినా పెడచెవిన పెడుతున్నట్లు సమాచారం. కలెక్టర్ ఈ వ్యవహారంపై సమగ్ర దర్యాప్తుకు ఆదేశించి బాధ్యులైన పంచాయతీ కార్యదర్శులు, ఎంపీడీఓలపై శాఖా పరమైన చర్యలు తీసుకోవాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

అనుక్షణం 'వెంటాడే జ్ఞాపకాలు'

–పుస్తకావిష్కరణ సభలో వక్తల ఉద్ఘాటన



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ప్రొఫెసర్ హరగోపాల్, టీటీడీ మాజీ చైర్మన్ భూమన కరుణాకర రెడ్డి, ఎంపీ గురుమూర్తి, సీహెచ్.శివారెడ్డి, జూపూడి ప్రభాకర్, మేయర్ డాక్టర్ శిరీష, ఎమ్మెల్సీ డాక్టర్ సిపాయి సుబ్రమణ్యం

తిరుపతి కల్చరల్: పాత జ్ఞాపకాలు పరిమళించే వీచిక 'వెంటాడే జ్ఞాపకాలు' అని, ఈ మధుర జ్ఞాపకాలు చక్కటి స్నేహ బాంధ్యవానికి దిక్సూచిగానే గాక నేటి తరానికి స్ఫూర్తిగా నిలుస్తాయని పలువురు వక్తలు ఉద్ఘాటించారు. టీటీడీ మాజీ చైర్మన్, చిత్తూరు, తిరుపతి జిల్లాల వైఎస్‌ఆర్‌సీపీ అధ్యక్షుడు భూమన కరుణాకరరెడ్డి ఆధ్వర్యంలో ప్రముఖ న్యాయవాది సీహెచ్.శివారెడ్డి రచించిన వెంటాడే జ్ఞాపకాలు పుస్తకావిష్కరణ సభ శనివారం పద్మావతి పురంలోని అన్నమయ్య కళా వేదికలో ఘనంగా నిర్వహించారు. శ్వేత భవన్ మాజీ సంచాలకుడు, సాహితీ వేత్త భూమన అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి ప్రొఫెసర్ హరగోపాల్, మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఎంపీ డాక్టర్ గురుమూర్తి, ఎమ్మెల్సీ డాక్టర్ సిపాయి సుబ్రమణ్యం, మేయర్ డాక్టర్ శిరీష, జూపూడి ప్రభాకర్ హాజరై 'వెంటాడే జ్ఞాపకాల పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా భూమన కరుణాకర రెడ్డి మాట్లాడుతూ మోసం, వంచన వంటి వాటికి తావులేకుండా తమకన్నా పెద్దవారితో స్నేహభావంతో సాగుతూ మంచి విషయాలను నేర్చుకుని సమాజ హితం కోసం స్ఫూర్తిదాయకంగా పనిచేశామని గుర్తుచేశారు. మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి మాట్లాడుతూ రాజకీయంగా తాను ఎదిగినా అవసరమైన సలహాలను శివారెడ్డి నుంచి అందుకుంటానని తెలిపారు. ప్రొఫెసర్ హరగోపాల్ మాట్లాడుతూ తాను అధ్యాపకుడుగా సాగుతున్న వేళ శివారెడ్డి, భూమన కరుణాకరరెడ్డి, భూమన వంటి వారు నాడు అనేక సాహసోపేతమైన పోరాటాలు సాగించారని తెలిపారు. అనంతరం పలువురు వక్తలు వెంటాడే జ్ఞాపకాల పుస్తకం గురించి కొనియాడుతూ రచయిత శివారెడ్డిని అభినందించారు. పలువురు సాహితీ వేత్తలు, కవులు, రచయితలు, విద్యావేత్తలు, వైఎస్‌ఆర్‌సీపీ నేతలు పాల్గొన్నారు.

సమాచారం ఇవ్వకుండానే తొలగిస్తారా?

- తిరుమలలో పుష్పాలంకరణ వివాదం
- టీటీడీ సిబ్బంది తీరుపై బెంగళూరు దాత ఆగ్రహం


దశావతారాల రూపాలను తొలగించి ట్రాక్టర్లోకి ఎక్కిస్తున్న ఉద్యానవన కార్మికులు


మాట్లాడుతున్న దాత సునీతా గౌడ్

తిరుమల: తిరుమల ఆలయంలో పుష్పాలంకరణలు తొలగించడంపై మనస్తాపానికి గురైన ఓ దాత టీటీడీపై ఆగ్రహం వ్యక్తం చేశారు. తిరుమల శ్రీవారి బ్రహ్మోత్సవాలు, వైకుంఠ ఏకాదశి వంటి పర్వదినాల సమయంలో ఎంతోమంది శ్రీవారి భక్తులు, దాతలు తిరుమలకు వచ్చి సహాయం చేస్తుంటారు. వైకుంఠ ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని టీటీడీ తిరుమలలో వైకుంఠ ద్వార దర్శనాలు కల్పించింది. ఈ సందర్భంగా దాతల సహకారంతో మొదటి రోజు, నాలుగో రోజు, ఏడో రోజు ఆలయం వద్ద పుష్పాలంకరణ చేయించింది. ఈ క్రమంలోనే బెంగళూరుకు చెందిన సునీతాగౌడ్ అనే దాత సహకారంతో పుష్పాలు, విగ్రహాలతో అలంకరణ చేయించారు. అయితే టీటీడీ సిబ్బంది ఆ విగ్రహాలను శనివారం ఉదయం తొలగించారు. విగ్రహాలను తీసి ట్రాక్టర్‌లో వేశారు. దీంతో టీటీడీ సిబ్బంది తీరుపై దాత ఆగ్రహం వ్యక్తం చేశారు. మూడు నెలల ముందే టీటీడీ వద్ద అన్ని అనుమతులు తీసుకుని ఆలయ అలంకరణ చేయించామన్నారు. విగ్రహాలు, చీరలు ఇలా అన్నీ కలిపి కోటి రూపాయలకు పైగా ఖర్చు చేసినట్లు వివరించారు. తమకు సమాచారం ఇవ్వకుండానే టీటీడీ సిబ్బంది అలంకరణను తొలగించారని ఆరోపించారు.

అది సంప్రదాయం కాదు

దాత సహకారంతో రంగనాయకుల మండపంలో స్వామి, దేవేరుల నమూనా విగ్రహాలను అలంకరించగా.. అది సంప్రదాయం కాదని అర్చకులు తెలిపినట్లుగా వీఆర్వో విభాగం ఒక ప్రకటనలో పేర్కొంది. అందుకే వాటిని తొలగించినట్టు తెలిపింది.

కంటిచూపే ప్రధానం


కంటి పరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్లు, పర్యవేక్షిస్తున్న డీటీవో మురళీమోహన్, ఎంవీఐలు

తిరుపతి మంగళం : వాహన డ్రైవర్లకు కంటిచూపు ఎంతో ప్రధానమని తిరుపతి జిల్లా రవాణాశాఖాధికారి(డీటీవో) కొర్రిపాటి మురళీమోహన్ తెలిపారు. రహదారి భద్రత మాసోత్సవాల సందర్భంగా శనివారం తిరుపతి జిల్లా రవాణాశాఖ కార్యాలయంలో వాసన్ ఐ కేర్ ఆస్పత్రి ఆధ్వర్యంలో కంటి పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని జిల్లా రవాణా శాఖ అధికారి కొర్రపాటి మురళీమోహన్, జిల్లా రహదారి భద్రత వైద్యురాలు డాక్టర్ పూజావాణి, డాక్టర్ ఆలోక్‌కుమార్ గుప్త పర్యవేక్షించారు. కార్యక్రమంలో దాదాపు 200 మంది పైగా మోటార్ వాహనాల డ్రైవర్లకు కంటి పరీక్షలు నిర్వహించారు. వీరిలో ఆరుగురు డ్రైవర్లకు శుక్లాలు ఉన్నాయని డాక్టర్లు గుర్తించారు. కార్యాలయ సిబ్బందికి కూడా కంటి పరీక్షలు నిర్వహించారు. అనంతరం డీటీవో మాట్లాడుతూ వాహనం నడిపేటప్పుడు మనసు నుంచి ఏకాగ్రత ఎంత అవసరమో కంటిచూపు కూడా అంతే అవసరమన్నారు. వాహనంలో నడిపే డ్రైవర్లందరూ తప్పనిసరిగా కంటి పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. సెల్ ఫోన్ అతి వినియోగం వల్ల కంటికి అద్దాలు అవసరం కావడం పరిపాటి అయ్యిందని వైద్యురాలు డాక్టర్ పూజావాణి అన్నారు. మోటార్ వాహనాల తనిఖీ అధికారులు సుబ్రహ్మణ్యం, శ్రీనివాస్, అతికానాజ్, స్వర్ణలత, పరిపాలనా అధికారులు శ్రీనివాసులు, విజయ ప్రశాంతి పాల్గొన్నారు.

యూజీసీ ముసాయిదాపై వర్క్‌షాపు


ప్రసంగిస్తున్న వీసీ ప్రొఫెసర్ ఉమ

తిరుపతి సిటీ : ఇటీవల వర్సిటీల అభివృద్ధిలో భాగంగా యూజీసీ విడుదల చేసిన 2025 రెగ్యులేషన్ ముసాయిదాపై పద్మావతి మహిళా వర్సిటీ సావేరీ సెమినార్ హాల్‌లో శనివారం ఫ్యాకల్టీ వర్క్‌షాపును నిర్వహించారు. ఇంటర్నేషనల్ క్వాలిటీ అష్యూరెన్స్ సెల్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ వర్క్‌షాపులో వీసీ ప్రొఫెసర్ ఉమ హాజరై ప్రసంగించారు. ఉన్నత విద్య అభివృద్ధే లక్ష్యంగా యూజీసీ విడుదల చేసిన 2025 ముసాయిదా ఆహ్వానించదగినదన్నారు. ప్రపంచ ప్రమాణాలకు దీటుగా వర్సిటీలో నాణ్యమైన విద్య, నూతన పరిశోధనలు, నిపుణులైన అధ్యాపకులను ప్రోత్సహించడం నూతన ముసాయిదాలో పొందుపరచడం జరిగిందన్నారు. జాతీయ విద్యా విధానానికి దోహదపడేలా ముసాయిదా ఉందని అభిప్రాయపడ్డారు. రిజిస్ట్రార్ రజిని, ఐఏసీ డైరెక్టర్ ప్రొఫెసర్ త్రిపుర సుందరి, విజ్ఞాన, వివిధ విభాగాల ప్రతినిధులు పాల్గొన్నారు.

పరిశుభ్రంగా కలెక్టరేట్


ఉద్యోగులచేత ప్రతిజ్ఞ చేయిస్తున్న డీఆర్వో

తిరుపతి అర్బన్: మన ఇల్లు, మన పరిసరాలను శుభ్రం చేసుకున్నట్లే.. మన కలెక్టరేట్‌ను కూడా శుభ్రం చేసుకోవాలని జిల్లా రెవెన్యూ అధికారి నరసింహులు సిబ్బందికి సూచించారు. ఆ మేరకు ఆయన కలెక్టరేట్ వద్ద శనివారం స్వచ్ఛాంధ్ర–స్వచ్ఛ దివస్‌లో భాగంగా ఉద్యోగులచేత ప్రతిజ్ఞ చేయించారు. ప్రతి నెలా 3వ శనివారం కార్యాలయాలను శుభ్రం చేసుకోవాలని చెప్పారు. అనంతరం కలెక్టరేట్‌లో పనిచేస్తున్న సుమారు 150 మంది ఉద్యోగులు కలెక్టరేట్ పరిసర ప్రాంతాల్లోని పిచ్చిమొక్కలను తొలగించారు. కార్యాలయంలోని ఫైల్స్, టేబుల్స్, ఇతర వస్తువులను శుభ్రం చేసుకునే పనిలో పడ్డారు.

డ్రైవింగ్ శిక్షణకు ఇంజినీరింగ్ విద్యార్థిని


డీపీటీఓ నుంచి పుస్తకాలు అందుకుంటున్న అక్షిత


పూర్ణిమా

తిరుపతి అర్బన్: డ్రైవింగ్ ఫీల్డ్ అంటే తెలిసిందే. పురుషులకే కష్టంగా ఉంటుంది. అలాంటిది మెకానికల్ ఇంజినీరింగ్ పూర్తి చేసిన మహిళలు డ్రైవింగ్‌పై ఆసక్తితో అలిపిరి డిపోలో ఆర్టీసీ నేతృత్వంలో హెవీ డ్రైవింగ్ లైసెన్స్ పొందడానికి ఇస్తున్న శిక్షణలో చేరుతున్నారు.

నాడు పూర్ణిమా...నేడు అక్షిత

1వ బ్యాచ్‌లో తిరుపతికి చెందిన పూర్ణిమా అనే మెకానికల్ ఇంజినీరింగ్ పూర్తి చేసిన విద్యార్థిని అలిపిరి డిపోలో శిక్షణ తీసుకుని హెవీ డ్రైవింగ్ లైసెన్స్ పొందారు. ఆ తర్వాత 31వ బ్యాచ్‌లో తిరుపతికి చెందిన అక్షిత అనే మెకానికల్ ఇంజినీరింగ్ పూర్తి చేసిన విద్యార్థిని శనివారం శిక్షణ కోసం అలిపిరి ఆర్టీసీ డిపోలో చేరారు. అంతకుముందు డీపీటీవో నరసింహులు చేతుల మీదుగా అలిపిరి డిపోలో 31వ బ్యాచ్ శిక్షణను ప్రారంభించారు. విద్యార్థులకు అవసరమైన పుస్తకాలను అందించారు. అలిపిరి డీఎం హరిబాబుతోపాటు అసిస్టెంట్ ఇంజినీర్ ప్రభాకర్, డ్రైవింగ్ ఇన్‌స్పెక్టర్ గోపాల్, రాము తదితరులు పాల్గొన్నారు.

సమర్థవంతంగా విధులు నిర్వహించాలి


సీసీ కెమెరాలు పరిశీలిస్తున్న ఎస్పీ మణికంఠ చందోలు

తిరుపతి క్రైం: అలిపిరి తనిఖీ కేంద్రం వద్ద సమర్థవంతంగా విధులు నిర్వహించాలని ఇన్‌చార్జ్ సీవీఎస్ఓ మణికంఠ చందోలు సిబ్బందిని ఆదేశించారు. శనివారం ఆకస్మికంగా అలిపిరి తనిఖీ కేంద్రాన్ని ఆయన పరిశీలించారు. అక్కడ ఉన్న సీసీ కెమెరాల పనితీరును విధుల్లో ఉన్న సిబ్బందితో మాట్లాడి తెలుసుకున్నారు. తిరుమల శ్రీవారి దర్శనానికి వచ్చే వివిధ రాష్ట్రాల భక్తులను మర్యాదపూర్వకంగా మాట్లాడుతూ.. తనిఖీలు చేయాలన్నారు. అనుమానస్పదంగా కనిపించే వ్యక్తులపై పూర్తి స్థాయిలో నిఘా ఉంచాలని చెప్పారు.